మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ హరిజన వీధికి చెందిన కామటి శ్రీనివాస్ ఇటీవల హత్యకు గురయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో హరిజన వీధికి చెందిన అంబేద్కర్ సింహ గర్జన యూత్ మరియు మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదివేల రూపాయల నగదును శ్రీనివాస్ తల్లి నీలమ్మకు అందజేశారు. అలాగే దయాకర్ అనే బాలుడు ఊపిరితిత్తుల సమస్యతో విశాఖలో చికిత్స పొందుతుండడంతో మహిళల ప్రోత్సాహంతో సింహ గర్జన యూత్, కుల పెద్దల ఆధ్వర్యంలో 25549 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సేవ సంఘం సభ్యులు,మాదిగ కుల సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన రథసప్తమి వేడుకలు

- సూర్య నమస్కారాలతో ప్రారంభమైన వేడుకలు
- అట్టహాసంగా సాగుతున్న సాంప్రదాయ క్రీడా పోటీలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర పండుగ అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభ మయ్యాయి. స్థానిక80 అడుగుల రోడ్డులో ఆదివారం ఉదయం 5 వేల మందితో చేపట్టిన సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభ మయ్యాయి. ఈ సూర్య నమస్కారాలు లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు , స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ , ఇతర ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు. సందర్భంగా ఈ నెల 4 వరకు శ్రీకాకుళం నగరంలోని "డచ్" భవనం ప్రాంగణంలో హెలికాప్టర్ ద్వారా విహరించే అవకాశాన్ని ప్రభుత్వ యంత్రాంగం కల్పిస్తూ కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ట్రిప్పుకు విహరించే కాలం 5 నిమిషాలుగా నిర్ణయించామని, ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1800 రెండేళ్ల లోపు పిల్లలకు ప్రవేశం లేదని చెప్పారు. ఆన్ లైన్ ద్వారా టికెట్స్ పొందడం తెలియని ప్రజల కోసం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ని ఏర్పాటు చేశామని వివరించారు. హెలికాప్టర్ రైడ్ బుక్ చేసుకున్న తేది, సమయానికి అనుగుణంగా ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 5.30 గం.ల మధ్య ఉంటుందన్నారు. హెలికాప్టర్ ద్వారా విహరించే అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యంత్రాంగం ఒక ప్రకటనలో కోరారు. టికెట్ల బుకింగ్ కోసం heliride.arasavallisun-god.org వెబ్సైట్‌ను సందర్శించాలని సూ చించారు. అలాగే నగరంలోని ఏడురోడ్ల కూడలిలో సాంప్రదాయ క్రీడలైన కర్రసాము, సంగిడి పోటీలు, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ స్పోర్ట్స్ కోటాను మూడు శాతానికి పెంచిందన్నారు. రథసప్తమి వేడుకల కు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కట్టుదిట్టమైన బందోబస్తుతో రథసప్తమి వేడుకలు

బందోబస్తు ఏర్పాట్లును పరిశీలించిన విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఆదివారం ఉదయం సూర్య నమస్కారాలుతో ప్రారంభమైన మూడు రోజులు రథసప్తమి వేడుకలకు కట్టుదిట్టమైన భద్రత,బందోబస్తు ఏర్పాటు చేశామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన నిమిత్తం ఆదివారం ఉదయం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తో కలసి అరసవల్లి రథసప్తమి భద్రత, బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ క్రమంలో ముందుగా మిల్లు జంక్షన్ లో ట్రాఫిక్ నియంత్రణ పరిశీలించి, క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్కడినుంచి నడక మార్గంలో అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయానికి చేరుకొని మార్గమధ్యంలో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ అంతరం లేకుండా, రోడ్డు మార్గంలో నిలిపిన వాహనాలను ఎప్పటికప్పుడు ట్రోయింగ్ వెహికల్‌తో క్లియర్ చేయించాలన్నారు. వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకొనే విధంగా అందరికీ తెలిసేలా రహదారి మార్గంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రథసప్తమి వేడుకలు నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను డీఐజీ సందర్శించి బందోబస్తు ఏర్పాటు, క్యూ లైన్లు, ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించచారు. కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలించారు. ఆలయం సింహ ద్వారం వద్ద భక్తులు రద్దీ లేకుండా అవస రమగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామివారి ఆలయం లోపల సందర్శించి భక్తులు ప్రవేశం, తిరుగు వెళ్లే మార్గాలను పరిశీలించి ఏటువంటి ఆటంకాలు లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్లు, టికెట్ విక్రయ కేంద్రాలు, ప్రసాదం కేంద్రం, ఉచిత దర్శనం క్యూ లైన్ వెళ్లే ఇంద్ర పుష్కరణ పరిసరాలను పరిశీలించి సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా పటిష్టమైన భారీకెడ్లు ఏర్పాటు చేసి ప్రశాంతంగా భక్తులు దర్శనం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఆలయం లోపల క్యూలైన్లు లో ఒకే సమయంలో అధిక సంఖ్యలో భక్తులు రద్దీ లేకుండా అవసరమగు భారీకెడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న సాంస్కృతి కార్యక్రమాలకు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలను జిల్లా పరిశీలించి,ఆదివారం మధ్యాహ్నం జరగనున్న శోభాయాత్ర తో పాటు ఇతర సాంస్కృతక కార్యక్రమాలుకు ఏటువంటి ఆటంకాలు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా నిర్వహణకు అన్ని విదల పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను రేంజ్ డీఐజీ గారు ఆదేశించారు. ఈ పరిశ్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్పి సిహెచ్ వివేకానంద ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

వేమన పద్య వివరణ కల్గినదే 'త్రైత సిద్ధాంత భగవద్గీత'

విశాలాంధ్ర - నరసన్నపేట : వేమన పద్య వివరణ కలిగిన నిగూఢ తత్వార్ధ భోధిని గ్రంధం త్రైత సిద్ధాంత భగవద్గీతని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక, తలసముద్రం కమిటీ అధ్యక్షులు, శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన బసివలస, బాలసీమ, చిక్కాలవలస, మామిడి వలస గ్రామాల్లోప్రచారం నిర్వ హించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన జయంతి మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రచా రంలో వేమన పద్యం వేయి విధముల అర్థాలు అమరి ఉండవచ్చు కాని, శోధించి చూస్తే అంతా ఆత్మ జ్ఞానమే ఉంటుందని అన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెలీటూరిజం ఉచితం

విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రథసప్తమి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆర్ట్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం డచ్ భవనం వద్ద అభినందించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా జిల్లాలో ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు, ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువు తున్న విద్యార్థులకు రథసప్తమి వేడుకల సందర్భంగా చిత్రాలు మాట్లాడుతాయి పేరుతో సమగ్రత సమానత్వం కాన్సెప్ట్ తోలి డ్రాయింగ్ పై పోటీలు నిర్వహించగా 645 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన సెంట్ జోసెఫ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న కె. యశ్వంత్ సాయి, శ్రీ చైతన్య స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న ఎం. నేహ అభియత్, శాంతినికేతన్‌లో ఐదో తరగతి చదువుతున్న బి.రోషిని, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎవిఎన్‌ఎంహెచ్ స్కూల్ లో పదో తరగతి చదువుతున్న జి.దేవరాజు, ప్రభుత్వ హైస్కూల్ శ్రీకాకుళంలో పదో తరగతి చదువుతున్న సిహెచ్. ప్రేమ్ కుమార్, ఎపి ఎంఎస్ జి. సిగడాంలో పదో తరగతి చదువుతున్న కె.యాశితలను జిల్లా కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు డ్రాయింగ్ చేసి గెలుపొందిన చిత్రాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. గెలుపొందిన విద్యా ర్థులకు ప్రభుత్వం తరపున ఉచిత హెలీటూరిజం విహారానికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య పాల్గొన్నారు.

పది పరీక్షల్లో విద్యార్థులు శత శాతం మార్కులు సాధించాలి

మండల విద్యా శాఖాధికారి-1, శాంతారావు

విశాలాంధ్ర - నరసన్నపేట : రానున్న మార్చి నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం మార్కులు సాధించాలని మండల విద్యా శాఖాధికారి-1, ఉప్పాడ శాంతారావు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలికలు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బోర్డు)ను సందర్శించారు. ఈ సంధర్భంగా ఆయన 'విశాలాంధ్ర'తోమాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు మండ లంలో పదవ తరగతి విద్యార్థులకు 100రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయటం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మండలంలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఉదయం తెలుగు, మధ్యాహ్నం హిందీ పాఠాలు విద్యార్థులకు భోదించామని, మధ్యాహ్న భోజన సౌకర్యం విద్యార్థులకు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఆయన పై పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పాసైతేనే విద్యార్థులు అన్ని రకాల పరీక్షలకు అర్హత పొందుతారన్నారు. పదవ తరగతిలో ఉత్తమమైన ర్యాంకులు సాధించినట్లయితే రాష్ట్ర ప్రభుత్వమే విద్యార్థులకు పై చదువులకు ఉచితంగా చది విస్తుందని, రానున్న పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి, తమ లక్ష్యాలను సాధంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పి.వెంకట రావు, శ్రీనివాసరావు, బి.రోహిణి, తెలుగు, హిందీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కర్రసాములో ప్రధమ స్థానం పొందిన 'శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్' విద్యార్థి

రథ సప్తమి పండుగల్లో ప్రతిభ కనబర్చిన యుగంధర్

విశాలాంధ్ర - నరసన్నపేట : శ్రీకాకుళంలోని అరసవిల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి వారి రథ సప్తమి పండుగల్లో భాగంగా విద్యా ర్థులకు నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో స్థానిక శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. కర్ర సాము పోటీల్లో పాల్గొన్న యుగంధర్ జిల్లాలో ప్రధమ స్థానంలో నిలిచి, బహుమతి గెలుపొందారు. ప్రధమ స్థానం కైవసం చేసుకున్న యుగంధర్‌కు జిల్లా పోలీస్ అధి కారులు, పండుగ నిర్వాహకులు, బహుమతి అందచేశారు. ఈ సంధర్భంగా కర్రసాములో ప్రధమ స్థానం పొందిన యుగంధర్‌కు శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు, బోర రామారావు, వెలమల భాస్కరరావు, తర్ర రామకృష్ణ, పాగోటి లక్ష్మీ, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణని కలిసి ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : ఆదివారం హైదరాబాద్‌లో ఉన్న హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పాతపట్నం నియోజక వర్గం శాసన సభ్యులు మామిడి గోవింద రావు పెళ్లి కార్డును అందజేశారు. 16-2-2025 వ తేదీన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ మామిడి సాయి గణేష్ వివాహానికి విచ్చేయాలని ఆహ్వానట్లు పాతపట్నం నియోజవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు మీడియాకు తెలిపారు.

తెప్పలకు రజతోత్సవ అభినందన సత్కారం

విశాలాంధ్ర - పలాస : శ్రీకాకుళం బాపూజీ కళామందిర్ లో ఆదివారం జరిగిన శ్రీకాకుళ రంగస్థల సమాఖ్య 304వ నెల కార్యక్రమంలో భాగంగా సంస్థ 25 వసంతాల ఉత్సవం పూర్తి చేసుకున్న సందర్భం పురస్కరించుకొని పలాస కు చెందిన కళాకారుడు, రచయిత సమాఖ్య కార్య వర్గ సభ్యుడు లయన్ డా తెప్పల కృష్ణ మూర్తిని అభినందన జ్ఞాపకతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు రామలింగ స్వామి, ప్రముఖ న్యాయ వాది మీగడ వినయ్ భూషన్, విశ్రాంత ప్రొఫె సర్.డా. నిక్కు అప్పన్న, లయన్ నాటుకుల మోహన్, ప్రధాన కార్యదర్శి రామచందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిత్తడి నేలలు రక్షణ బాధ్యత మనందరిది

విశాలాంధ్ర- సంతబొమ్మాళి : చిత్తడి నేలల పరిరక్షణ బాధ్యత మన అందరిదీ అని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సోంపేట మండలం బీల ప్రాంతాల పరిరక్షణ కమిటీ బాధ్యులు బీన ఢిల్లీరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టులు సమైక్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం సంతబొమ్మాళి మండలం వడ్డీతాంద్ర గ్రామంలో ధర్మల్ పవర్ నిర్మాణానికి ప్లాంట్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న ధర్నాలో పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుమారు 40 గ్రామాలకు జీవనాడిగా ఉన్న కాకరపల్లి తంపర ప్రాంతం రక్షించుకోవలసిన బాధ్యత మన అందరిదీ అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మల్ పవర్ ప్లాంట్ పోరాట కమిటీ నాయకులు అనంత హన్ను రావు, కారుణ్య కేత్రో, గన్నుతో పాటు నాయకులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్టలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం



విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం పొన్నూ టూరు గ్రామం రామా లయ ప్రతిష్టలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తెజేశ్వర రావు పాల్గొన్నారు ఆయనకు గ్రామస్తులు. దుశాలువాతో సన్మానించారు. రాములవారి ప్రతిష్ట కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, కొత్తూరు మండల నాయకురాలు దమయంతి, అప్పల నాయుడు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా చేశారు

ఎస్టీయు నాయకులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం 2020లో మాతృభాషలకు ప్రాధాన్యం పెంచమని చెబుతుంటే రాష్ట్రంలో మాత్రం పూర్తిగా తెలుగు మీడియం లేకుండా కేవలం ఇంగ్లీషులో బోధన చేస్తూ తెలుగును కనుమరుగు చేయటానికి పాలక వర్గం కంకణం కట్టుకోవడం తమను ఎంతగానో ఆందోళన గురిచేస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. వి.రమణ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణలు ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మాతృ భాషలో బోధన జరిగితేనే పిల్లలు సునాయాసంగా నేర్చుకోగలుగుతారని, సృజనాత్మక ఆలోచనలకు దోహదపడుతుందని, అందుకే మాతృ భాషలోనే బోధన జరగాలన్నారు. ఈ విధంగా ఇంగ్లీష్ భాషకు దూరంగా మాతృభాషలోనే విద్యను బోధిస్తున్నటువంటి చైనా, జపాన్ వంటి దేశాలు నూతన ఆవిష్కరణలలో అగ్రగామిగా నిలుసున్నారన్నారు. రాష్ట్రంలో మాత్రం బలవంతంగా పరాయి భాషలో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు విద్యను అభ్యసించడం వల్ల ఇటు తెలుగు రాక అటు ఇంగ్లీషు రాక చదువులు ఒత్తిడితో పిల్లలు సతమతమవుతున్నారని ఆవేదన చెందారు. గతంలో ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలు ఉండేవని కానీ తర్వాత రోజుల్లో రెండు మీడియంలో బోధనకు ఎక్కువమంది ఉపాధ్యాయుల అవసరం అవుతున్నారని తెలుగు మీడియంను పూర్తిగా రద్దుచేసి ఒక ఇంగ్లీష్ మీడియంను కొనసాగిస్తూన్నారని, ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు వరకు మాత్రమే తెలుగులో రాసుకునే అవకాశం ఇచ్చారని తర్వాత రోజుల్లో ఒక ఇంగ్లీష్ మీడియాన్ని కొనసాగించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులు బోధనకు అనువుగా ఉండేలా రెండు రకాల మీడియంలు అందుబాటులో ఉండాలని, మీడియం ఐచ్ఛికంగా ఉండాలని ప్రాథమిక తరగతులలో మాతృభాషలోనే బోధన జరగాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలలలో సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించాలన్నారు. పెండింగ్ బకాయిల విడుదల, ఐఆర్, పిఆర్ సిలపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్య అతిథిగా మన్యం జిల్లా అధ్యక్షులు పి.పురుషోత్తం, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, పి. వసంతకుమారి, సిహెచ్ జగన్, యన్.లక్ష్మణరావు, వసంత కుమారి, ఎమ్.తేజేశ్వరరావు, జె.రాజేంద్ర ప్రసాద్ పలు మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ విజేత గొల్ల మాకన్నపల్లి

విశాలాంధ్ర - పలాస : మండలం గొల్ల మాకన్నపల్లి గ్రామంలో అభయ ఆంజనేయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా కాశీబుగ్గ బిగ్ సి సెల్ ఫోన్ షాపు, గ్రామ సంఘం, గ్రామ కమిటి ఆద్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆహ్వానిత జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గొల్ల మాకన్నపల్లి బృందం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్, వైసీపీ యువజన నాయకులు మామిడి నరసింహమూర్తి, మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, మాకన్నపల్లి సచివాలయం రెవెన్యూ సర్వేర్ కొల్లి ఫాల్గుణ మాట్లాడుతూ క్రీడా కారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల మధ్య, క్రీడాకారుల మధ్య సంబంధాలు మెరుగు పడతాయన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల ప్రతిభ బయట పడుతుందన్నారు. అనంతరం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి 13 బృందాలు పాల్గొనగా ప్రధమ స్థానంలో గొల్ల మాకన్నపల్లి నిలవగా రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో పలాస మండలం మామిడిపల్లి, మందస మండలం బహడపల్లి విజేతలుగా నిలిచాయి. విజేతగా నిలిచిన గొల్ల మాకన్నపల్లికు రూ. 12 వేలు నగదు షీల్డ్, శ్రీకాకుళం జుట్టుకు రూ. 10 వేలు నగదు షీల్డ్, మూడో స్థానంలో పలాస మండలం మామిడిపల్లికు రూ. 5 వేలు నగదు షీల్డ్, మందస మండలం బహడపల్లి జుట్టుకు రూ. 5వేలు నగదు షీల్డ్ ను ఆర్థిక సహాయం అందజేసిన కుత్తుం లక్ష్మణ్ కుమార్, మామిడి నరసింహమూర్తి, కొల్లి ఫాల్గుణ, సైని దేసయ్య విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువజన సంఘం సభ్యులు, గ్రామ కుల సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత దేశ సైనికులకు ఘనంగా స్వాగతం

విశాలాంధ్ర - పలాస : మండలం కేదారిపురం గ్రామానికి చెందిన విశ్రాంత దేశ సైనికులు పాడి వేణు గోపాల్, పాడి త్రినాథ్‌లను ఆదివారం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పాడి వేణు గోపాల్ 24 ఏళ్ళుగా ఆర్మీలో పని చేస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మెరేడ్ లో ఉద్యోగ విరమణ పొందగా పాడి త్రినాథ్ 30 ఏళ్ళుగా పని చేస్తూ జమ్మూకాశ్మీర్‌లో దేశ భద్రత దళంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. దేశ సైనికులు ఉద్యోగ విరమణ పొంది గ్రామానికి వస్తున్నారని తెలిసి గ్రామస్తులు పలాస రైల్వే స్టేషన్ వద్దకు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. పలాస రైల్వే స్టేషన్ నుంచి కాశీబుగ్గ పలాస జంట పట్టణాలు మీదుగా ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామానికి వచ్చిన వెంటనే పాడి వేణుగోపాల్ తన తల్లి పాడి బుద్ధిమ్మకు తన టోపి తలకు పెట్టి వందనం చేశారు. అనంతరం ఆర్మీ జవాన్లుకు జాతీయ జెండా, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. మహిళలు మంగళ హారతులు పట్టి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడసింగి ధనుంజయ, పాడి దుర్యోధన, పాడి కిరణ్, పాడి ఈశ్వరరావు, బి.రమేష్, కొల్లి సోమేశ్వరరావు, పి.జగదీష్, పి.సూర్యారావు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథసప్తమి శోభాయాత్ర

- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు - వేలాదిగా భక్తుల హాజరు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నగరంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వేడుకలలో శోభాయమానంగా ఏర్పాటు చేసిన శోభాయాత్ర వేలాది మంది భక్తులు నడుమ దిగ్విజయంగా సాగింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర కాలేజీ రోడ్డు నుండి ప్రారంభమై డే అండ్ నైట్ జంక్షన్, కృష్ణా పార్క్, సెవెన్ రోడ్ జంక్షన్, సూర్య మహల్ జంక్షన్, ప్రభుత్వ మహిళా కళాశాల మీదుగా అరసవిల్లి ప్రధాన ఆలయం వరకు సాగింది. ఈ శోభాయాత్రలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, తప్పెటగుళ్ళు, దింసా, కోయ నృత్యం, కొమ్ము నృత్యం, బిందెల డాన్స్ వంటి ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. వందమంది మహిళలతో కలశ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ దేవస్థానాల శోభాయాత్రలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నాయి. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక, అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి, ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం జిల్లా రామతీర్థం శ్రీ రామస్వామి దేవస్థానాల శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ గ్రామంలో రాజు దంపతులచే నూతనంగా నిర్మించిన భూలోకమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన మహెూత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు, పురోహితులు వేదమంత్రాలు నడుమ అమ్మ తల్లికి షోడ శోపాచార పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో వచ్చిన మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో నౌపడ గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణ మన భవిష్యత్‌కు రక్షణ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : భూమి పై ప్రాణికోటి మనగడకు చిత్తడి నేలలే మూలమని నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ టి.లోకేశ్వరరావు అన్నారు. చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎన్జిసి డైరెక్టర్ ఆదేశాల మేరకు బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ, చిత్తడి నేలలు సహజ నీటి శుద్ధి కేంద్రాలుగా, వర్షపు నీటిని భూగర్భానికి చేరుస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడే అద్భుత నేలలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ, చిత్తడి నేలలు భూకంప ఉధృతిని తగ్గించడంలో, వాతావరణ మార్పులను నియంత్రించడంలో, జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో కీలక భూమిక పోషిస్తాయని అన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్ మాట్లాడుతూ, కాలుష్య కారకాలు గ్రహించి, నీటి నాణ్యతను పెంచడంలో చిత్తడి నేలలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా " "చిత్తడి నేలల పరిరక్షణ - ఆవశ్యకత" మీద విద్యార్థులకు డిబేటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం చిత్తడి నేలలు పరిరక్షణకు ప్రజలు నడుము బిగించాలని నినా దాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాదాన రాజు, ఉపాధ్యాయులు డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధ రావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతి రావు, శంకరరావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి, పాల్గొన్నారు.

ఇదొక చారిత్రాత్మకమైన బడ్జెట్

టెక్కలి బీజేపీ మండల అధ్యక్షులు జర్జాన రాంజీ



విశాలాంధ్ర - టెక్కలి : ప్రధాని మోడీ నాయకత్వంలో వికసిత భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని టెక్కలి బీజేపీ మండల అధ్యక్షులు జర్జాన రాంజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యతరగతి ఆదాయ వర్గాయులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తీపి కబురును ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025- 26 బడ్జెట్ లో ప్రతిపాదించారని అన్నారు. 12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు నివ్వడం ఓ విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. యువతలో నైపుణ్యా అభివృద్ధి, ఉద్యోగ శిక్షణ, రైతుల సంక్షేమానికి ప్రాధన్యమిచ్చారన్నారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ద్వారా హామీ లేకుండా ప్రస్తుతమిచ్చే రుణాన్ని రూ.5 కోట్లు నుండి రూ.10 కోట్లు కేంద్రం పెంచిందన్నారు. విస్తరణ కారణంగా సుమారు కొన్ని వేల మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచడం అభినందనీయ మన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ఈ సందర్భంగా రాంజీ ధన్యవాదాలు తెలియజేశారు.

ఎన్ఈఆర్ స్కూల్‌లో స్కాలర్ షిప్ టెస్ట్‌కు భారీ స్పందన

హాజరైన సుమారు 2000 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - రణస్థలం : మండలం నడుకుదిటి పాలెం లో ఉన్న ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఏర్పాటు చేసిన స్కాలర్ షిప్ టెస్ట్ కు విద్యార్థులు పెద్ద ఎత్తున స్పందన లభించింది. నియోజవర్గం నలుమూలల నుండి సుమారు 2000 మంది పైగా రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్ష వ్రాసారు.

వారికి డైరెక్టర్ తేజ బాబు నేతృత్వంలోని స్కూల్ మేనేజ్మెంట్ తగిన ఏర్పాట్లు నిర్వహించింది. వారికి డ్రింక్స్, వాటర్ బాటిల్, భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. రణస్థలం రామతీర్థం జంక్షన్ వరకు రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు.

రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు... ప్రజలకు మేలు చేకూర్చే బడ్జెట్

రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు ముడిదాన ఆనంద్ కుమార్ వడ్డెర

విశాలాంధ్ర - టెక్కలి : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై స్పందించిన ముడిదాన ఆనంద్ కుమార్ వడ్డెర ఆ బడ్జెట్ దేశ చరిత్రలో నిలిచిపోతుందని, రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు కురిపించిందని ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. వికసిత్ భారత్ విజన్‌ను ప్రతిబింభించేలా బడ్జెట్ ఉందన్నారు. ప్రజలకు మేలు చేకూర్చే బడ్జె టన్నారు. మహిళా, పేదల, యువత, వ్యవసాయ దారుల సంక్షేమానికి బడ్జెట్ పెద్దపీట వేసిందన్నారు. రానున్న ఐదేళ్లలో ఆరు కీలక రంగాల్లో అభివృద్ధికి ఈ బడ్జెట్ మార్గదర్శకతం చేస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేకంగా కేటాయింపులు చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గతేడాది కంటే రూ.400 కోట్లు కేటాయించ్చిందని, మొత్తంగా రూ.5,936 కోట్లు ఇస్తున్నట్లు బడ్జెట్‌లో కేంద్రం పేర్కొందన్నారు. విశాఖపట్నం పోర్టుకు కూడా గతేడాదితో పోలిస్తే రూ.445

కోట్లు అధికంగా ఇస్తోందని, మొత్తంగా విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు కేటాయించిందన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తారు నీరు అందిచాలన్నది ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కల అని తెలిపారు. 2028 వరకు జల్ జీవన్ మిషన్ పొడిగింపుతో ఏపీకి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జల్ జీవన్ నిధులు దుర్వినియోగం చేశారని విమర్శించారు. అలాగే విశాఖ ప్రాజెక్టులకు నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు ప్రోత్సాహం, ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు, విద్య, రవాణా, నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు, లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆపరేషన్‌కు మద్దతుగా రూ.375 కోట్లు, రాష్ట్ర రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.240 కోట్లు, ఏపీ ఇరిగేషన్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్?కి రూ.100 కోట్లు పెంపు, లైవ్లీహుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు రెండో దశకు రూ.242.50 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు.

గత ఏడు నెలల్లో కేంద్రం అమరావతికి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్?కి రూ.11,440 కోట్లు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కి రూ.14 వేల కోట్లు, వెనుకబడిన జిల్లాలకు రూ.1,750 కోట్లు, గ్రీన్ హైడ్రోజన్ హబ్?కు రూ.1.8 లక్షల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.2800 కోట్లు, పారిశ్రామిక కారిడార్లకు రూ.4936 కోట్లు, బీపీసీఎల్ రిఫైనరీకి రూ.95 వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కాగా రాష్ట్రానికి ఇన్ని వేల కోట్లు కేటాయించడం పట్ల ప్రజల తరఫున ప్రధాని మోడీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ముడిదాన ఆనంద్ కుమార్ వడ్డెర కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్

విశాలాంధ్ర - టెక్కలి : గొర్రెల కాపరులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం పెట్టెసరియాకు చెందిన గండేటి అప్పలస్వామికి చెందిన 30 గొర్రెలు మృతి చెందిన విషయం తెలుసుకొని ఆదివారం బాధితులు దగ్గరికి వెళ్లి ఏం జరిగిందోనని పరిశీ లించారు. నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ బడబంద గ్రామ పొలంలో ఉన్న మంద దగ్గరికి ఆయనతోపాటు అధికారులు వెళ్లి పరిశీలించారు. అక్కడికి వెళ్లి చూసేసరికి గండేటి అప్పల స్వామికి చెందిన 34, అంబలి మల్లేశుకు చెందిన 10, అంబలి లక్ష్మీనారాయణ కు చెందిన 7, జోగా గంగయ్య కు చెందిన 10 గొర్రెలు మృతి చెందాయని బాధితులు తెలిపారు. అక్కడికి వెళ్లి చూసేసరికి మృతి చెందిన వాటిలో కొన్ని కుక్కలు, నక్కలు తీసుకుపోగా మిగిలినవి గొయ్యి తీసి పాతిపెట్టామని లబోదిబోమని కన్నెమున్నేరు

కార్చు కుంటూ అధికారులకు బాధితులు మొం పెట్టుకున్నారు. డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు అక్కడ ప్రస్తుతం ఉన్న రెండు గొర్రెలను పోస్టు మార్టం చేశారు. అనంతరం డాక్టర్ మాటా డుతూ పంట పొలాల్లో ఉన్న అధిక మొత్తంలో ధాన్యం తినడంతో గొర్రెలకు జీర్ణంకాక అస్తవస్థకు గురై మృతి చెందాయని నిర్ధారించారు. ప్రస్తుతం ఇన్సూరెన్స్ పథకం లేదని, అందువల్ల మేము రిపోర్టు ఇవ్వగలం కానీ బాధితులకు నష్టపరిహారం వస్తుందని చెప్పలేమని తెలిపారు. అనంతరం డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతకు ముందు ప్రభుత్వంలో ఉన్న పశు నష్ట పరిహారం పథకం కింద గొర్రెల కాపరులకు వర్తించేదని, దాన్ని మరలా పునరుద్ధించాలని, నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించే విధంగా కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులు ప్రతి ఒక్కరూ మూగజీవాలకు ఇన్సూరెన్సు తప్పని సరిగా చేయించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గతంలో కొన్ని గొర్రెలకు ఇన్సూరెన్స్ లు చేయించుకున్నామని ఇన్సూరెన్స్ చేయించుకున్న తర్వాత వాటికి ఒక నిర్ధారణ సంఖ్యతో నెంబర్ ఇచ్చారని, దాన్ని గొర్రెలు, మేకలు చెవికి అతికించే వాళ్ళు మని, అవి పొలాలలో తిరిగేటప్పుడు పడిపోయేవని, మరి కొన్నిటికి వాటి వల్ల పురుగు చేరి వ్యాధులు వచ్చేవని బాధితులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఎస్, వీడి లింగాలవలస, జె చిన్నమ్మి జేవివో, ఆర్ఎల్‌యు, బి.ధనలక్ష్మి ఏహెచ్ఏ ఇన్చార్జ్ ఆర్ఎస్కే గూడెం బాధితులు తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర రాష్ట్ర మంత్రులు

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో మబ గాం గ్రామంలో ఆహ్వానం మేరకు ఆదివారం వివాహ వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొ న్నారు. ఈ మేరకు అడ్వకేట్ ఇప్పిలి తాత కుమారుడు మరియు దీర్ఘాసి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు కుమార్తె వివాహ వేడుకల్లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అక్కడికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు ప్రజాభిమానులు విచ్చేశారు.

వైసీపీ ఫీజు పోరు

5న కలెక్టరేట్ వద్ద నిరసన

విశాలాంధ్ర - ఆమదాలవలస : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు చెల్లించ వలసిన ఫీజు రియంబర్స్మెంట్ అందించక పోవ డంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవి కుమార్ అన్నారు. శనివారం ప్రజాసవా కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్ విడుదల చేశారు. ఫిబ్రవరి 5వ తేదీన విద్యా ర్థులు తల్లిదండ్రులతో కలసి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులు ప్రైవేట్ యాజ మాన్యాల వద్ద పడుతున్న ఇబ్బందులను కలె క్టర్లకు వినతి పత్రాన్ని అందించమన్నారు. ఐదో తేదీ ఉదయం ప్రజాసేవ కార్యాలయం వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు వైఎస్ఆర్ సీపీ కేడర్ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సివి నాయకులు నాగేశ్వరరావు, గోవిందరావు, దుంపల శ్యామలరావు, మామిడి రమేష్, సంపద రావు రామా రావు, బద్రి రామారావు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన 'పారశిల్లి-రెల్లివలస-అల్లాడ' రహదారి పనులు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని పారశిల్లి పంచాయితీలోని రెల్లివలస - అల్లాడ గ్రామాల మధ్యన బి.టి రహదారి పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్నేళ్ళుగా రహదారి నిర్మాణం కోసం ఎదురు చూసిన రెల్లివలస, అల్లాడ గ్రామాల ప్రజలు రహదారి పనులు ప్రారంభ కావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత జనవరి నెల 24వ తేదీన సుమారు రూ.3.20 కోట్లతో బి.టి రహదారి పనులకు నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి భూమి పూజ నిర్వహించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై రహదారులు, భవనాల శాఖ ఏ.ఈ, శ్రీనివాసరావు 'విశాలాంధ్ర'తో మాట్లాడుతూ గత పది రోజుల నుండి రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగింపు, భూమి చదును పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. వచ్చే మార్చి నెలాఖరు నాటికి శత శాతం బి.టి రహదారి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు

విశాలాంధ్ర - పొందూరు : ప్రభుత్వ విద్యను పేద, బడుగు బలహీన వర్గాల వారికి దూరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం సమంజసం కాదని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న తెలిపారు. ఆదివారం తాడివలస ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 117 జీవోను సవరిస్తున్నామని, లోపాలను గుర్తించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవానికి ప్రభుత్వ బడులు మూసేందుకే మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసేసి, ఫౌండేషన్ పాఠశాలల సంఖ్య పెంచి ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నారని తెలిపారు. 20 శాతం ఆదర్శ పాఠశాలలు, 80 శాతం అనాథ పాఠశాలలనే ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక పాఠశాలలను అనుసంధానం చేసి అర్హత కలిగిన ఉపాధ్యా యులను నియమించాలని కోరారు. డియస్సీ నోటిఫికేషన్ జారీ చేయకుండా తాత్సారం చేస్తూ లేనిపోని ప్రయోగాలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ పొందూరు మండల బాధ్యులు గండెం రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అబాకస్ పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - మెళియాపుట్టి : అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో మెళియాపుట్టి మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అందులో భాగంగా నలంద, యూని వర్సియల్, విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ఇరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జె జె ఎస్ ప్రతాప్, కలమట శేఖర్లు తెలిపారు. మండలంలో ఆయా పాఠశాలల చెందిన వారు ఆదివారంనాడు ప్రకటనలో తెలియ జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఫిబ్రవరి 2వ తేదీన జిల్లా కేంద్రంలో వికాస్ పాఠశాలలో విశ్వం ఎడ్యుకేషనల్ ల్యాబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీలో జిల్లాస్థాయిలో 40 పాఠశాలకు చెందిన 750 విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేస్తూనే మెళియాపుట్టి మండలం లో యూనివర్సియల్ పాఠశాలకు చెందిన సీనియర్ విభాగం నుంచి ఏడవ తరగతికి చెందిన డీ.శృతి విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. అలాగే నలంద పబ్లిక్ పాఠశాల కు చెందిన యు. హర్షవర్ధన్ రెడ్డి నాల్గవ తరగతికి చెందిన విద్యార్థి విజయం సాధించారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను నిర్వాహణ సంస్థ అందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.